




By Andhra Pradesh News Desk
Updated : 29 Apr 2025 06:45 IST

# USA: అమెరికాకా.. వెయిట్ అండ్ సీ!

ప్రాంగణ నియామకాల్లో కొలువులు దక్కినా.. మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎంఎస్) చేయడానికి అమెరికాకే గమ్యస్థానం అని కలలు కన్న వేల మంది తెలుగు రాష్ట్రాల ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రణాళికలు మార్చుకుంటున్నారు.

### 50-60 % మంది విద్యార్థులది ఇదే యోచన

### విదేశీ విద్య కన్సల్టెన్సీలు వెలవెల

### ఆగస్టు, సెప్టెంబరు ఫాల్ సీజన్‌కు దరఖాస్తుల కరవు



ఈనాడు, హైదరాబాద్: ప్రాంగణ నియామకాల్లో కొలువులు దక్కినా.. మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎంఎస్) చేయడానికి అమెరికాకే గమ్యస్థానం అని కలలు కన్న వేల మంది తెలుగు రాష్ట్రాల ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రణాళికలు మార్చుకుంటున్నారు. అగ్రరాజ్యంలో పరిస్థితులు సానుకూలంగా లేవన్న నిర్ణయానికి వచ్చిన మన విద్యార్థులు.. తాత్కాలికంగా ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నారు. ఫలితంగా అమెరికాలో వచ్చే ఆగస్టు/సెప్టెంబరులో తరగతులు మొదలయ్యే ఫాల్ సీజన్‌కు వెళ్లే విద్యార్థుల సంఖ్య సగానికిపైగా తగ్గనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉన్నతవిద్యకు విదేశాలకు వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నవారితో ఏటా మార్చి నుంచి కిటకిటలాడే కన్సల్టెన్సీ కార్యాలయాలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి.

**ప్రధానంగా 'పార్ట్ టైమ్' ప్రభావం..**

అమెరికాలో పార్ట్ టైమ్ ఉద్యోగాలు లభిస్తుండటం, చదువు పూర్తయ్యాక మూడేళ్లపాటు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) కింద ఉద్యోగం చేసుకునే వెసులుబాటు ఉండటంతో అధిక శాతం మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఆ దేశానికే మొదటి ప్రాధాన్యమిస్తారు. అమెరికా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఓపెన్ డోర్ నివేదిక ప్రకారం 2023-24లో అమెరికాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో భారతదే ప్రథమ స్థానం. అక్కడ భారతీయ విద్యార్థులు 3.30 లక్షల మంది ఉండగా... వారిలో తెలుగు రాష్ట్రాల వారు 56 శాతం... అంటే 1.85 లక్షల మంది ఉన్నారు. ఆ ప్రకారం ఏటా 40 వేల నుంచి 50 వేల మంది తెలుగు విద్యార్థులు అమెరికాకు వెళుతున్నారు. జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయడం... ఆ వెంటనే అక్రమ వలసదారుల వేట కొనసాగడంతో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్న విద్యార్థులు తాము కూడా పట్టుబడతామని భావించి ఎక్కడికక్కడే మానేశారు. ఈ పరిస్థితుల్లో కొత్తగా అమెరికా వెళ్లాలనుకున్న వారు ఆగిపోతున్నారు. వర్సిటీలకు దరఖాస్తు చేసి... ప్రవేశానికి ఆమోదం లభించి ఐ-20 పత్రాన్ని అందుకున్నవారు సైతం వీసాకు దరఖాస్తు చేయడం లేదు.

**కన్సల్టెన్సీ సంస్థల వ్యాపారం ఢమాల్**

హైదరాబాద్‌లో దాదాపు 2 వేల విదేశీ విద్య కన్సల్టెన్సీ సంస్థలు ఉన్నాయని ఆ వర్గాలు చెబుతున్నాయి. వాటిల్లో పెద్దవి 100 వరకు ఉన్నాయి. విద్యార్థుల దరఖాస్తు ప్రాసెస్ చేసేందుకు అవి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తుంటాయి. అనేక కన్సల్టెన్సీలకు అమెరికాలోని వర్సిటీలతో ఒప్పందాలుంటాయి. ఆ వర్సిటీలు తమకు వచ్చే ఫీజులో కొంత శాతాన్ని కన్సల్టెన్సీలకు ఇస్తుంటాయి. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో వారి ఆదాయాలు పడిపోతున్నాయి. ఇదేసమయంలో దేశంలో ఎంటెక్ లేదా ఎంబీఏ చేసే వారి సంఖ్య ఈసారి పెరగవచ్చని కళాశాలలు అంచనా వేస్తున్నాయి.

'మాకు వచ్చే దరఖాస్తుల సంఖ్య 25 శాతం తగ్గింది. ఈ సీజన్ వరకు ఆగుదాం... జనవరిలో వెళదాం అని విద్యార్థులు భావిస్తున్నారు' అని గ్లోబల్ ట్రీ కన్సల్టెన్సీ డైరెక్టర్ ఉదయ్ చెప్పారు. తమ వద్ద నమోదు చేసుకున్న వారిలో 225 మంది జనవరి వరకు ఆగుతామని చెప్పారని తెలిపారు.

యూకే, కెనడా తదితర దేశాలకు వెళ్లే విద్యార్థులు పెరగవచ్చన్నారు. 'గత ఏడాదే అమెరికాలో ఉద్యోగాలు తగ్గాయి. దానికితోడు ట్రంప్ రాకతో ఇబ్బందులు మొదలయ్యాయి. పరిస్థితులు చక్కబడే వరకు వేచిచూద్దామని విద్యార్థులు అనుకుంటున్నారు' అని ఐఎంఎఫ్ఎస్ కన్సల్టెన్సీ ప్రతినిధి సమతారాణి వివరించారు.

ఈసారి ప్రాంగణ నియామకాలు సైతం తగ్గాయి. విదేశీ విద్యకు వెళ్లాలనుకున్న వారు సైతం ట్రంప్ రాకతో ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నారు. ఏటా మా వర్సిటీ నుంచి 60-65 శాతం మంది విదేశీ విద్యకు వెళతారు. ఈసారి వారి సంఖ్య బాగా తగ్గింది.

**- విజయ్‌కుమార్, మహీంద్ర విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ అధికారి**

గతంలో మా కళాశాల నుంచి 100-120 మంది ఎంఎస్ చేయడానికి విదేశాలకు వెళ్లేవారు. ఈసారి 30- 0 మందికి మించడం లేదు. మంచి ప్యాకేజీతో ఉద్యోగం వస్తే ఇక్కడే ఉండాలన్న భావన విద్యార్థుల్లో కనిపిస్తోంది. చిన్న కొలువు వచ్చినా చేద్దాం.. పని అనుభవం వస్తుంది.. తర్వాత విదే ి విద్య వైపు చూద్దాం అని అనుకుంటున్నారు.

**- రవిప్రకాశ్‌రెడ్డి, నారాయణమ్మ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి**

**50-60 శాతం వరకు తగ్గుతారు**

**- నవీన్ యాతప్ప, కార్యదర్శి, కన్సార్షియం ఆఫ్ ఫారిన్ ఎడ్యుకేషన్ ఏజెన్సీస్, హైదరాబాద్**

ఈసారి తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికాలో విద్యకు వెళ్లే విద్యార్థుల సంఖ్య 50-60 శాతం తగ్గుతుందని భావిస్తున్నాం. ట్రంప్ తొలిసారి గెలిచిన 2017లో కూడా వివిధ చర్యలతో భయపెట్టారు. ఇప్పుడూ అదే చేస్తున్నారు. మొత్తానికి ఒక ఏడాదిపాటు ఈ ప్రభావం ఉంటుంది.